

నగరంలో మళ్లీ టోయింగ్

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆపేసే ద్విచక్రవాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకునే టోయింగ్ ప్రక్రియ నగరంలో మళ్లీ ప్రారంభమైంది. బీజేపీ ప్రభుత్వంలో నగరంలో టోయింగ్ విధానాన్ని ఆపేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తోంది. తాజాగా టోయింగ్‌ను ప్రారంభించారు. గాంధీనగర్‌లో శుక్రవారం రోడ్డుపక్కన ద్విచక్రవాహనాలను తరలించారు.



టోయింగ్ చేస్తున్న పోలీసులు

పోరాటానికి సిద్ధూ వ్యూహం

- రాజకీయంగా అమీతుమీకి సన్నద్ధం
- అనుకూలంగా రంగంలోకి మఠాధిపతులు
- నేటి హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- పదోన్నతి లభిస్తే సంతోషమే..
- హోంశాఖ మంత్రి పరమేశ్వర్



సిద్దరామయ్య



పరమేశ్వర్



హైకోర్టు

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): 'ముడా' అవినీతి వివాదంలో హైకోర్టులో తనకు వ్యతిరేకంగా నిర్ణయం వస్తే రాజీనామా చేయకుండా పోరాడేందుకే ముఖ్యమంత్రి సిద్దరామయ్య అడుగుల వేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని గంటల్లోనే హైకోర్టు ధర్మాసనం ముందు విచారణలు కొనసాగనున్నాయి. తీర్పు అనుకూలమైతే సజావుగా ముగిసినట్టవుతుంది. ఒకవేళ గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం సమంజసమేమని ఆదేశిస్తే రాజకీయ పోరాటం చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా సీఎం సిద్దరామయ్య వ్యవహరిస్తున్న తీరును పరిశీలిస్తే వాస్తవమనిపిస్తోంది. పార్టీ ముఖ్యులపైనా అహింద అస్త్రాన్ని ప్రయోగించే అవకాశాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. సిద్దరామయ్యను కాంగ్రెస్ ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదని పలు బీసీ కులాలకు చెందిన మఠాధిపతిపతులు పిలుపునివ్వడం ఆ పార్టీలో రానున్న రోజుల్లో జరిగే పరిణామాలకు సందేశమిచ్చినట్టు అవుతోంది. ఇటీవల కనకగురు పీఠాధిపతి నేతృత్వంలో సమావేశమైన పలువురు మఠాధిపతులు సిద్దరామయ్యకు అనుకూలంగా ఉంటామని బహిరంగంగా ప్రకటించారు. దీన్నిబట్టి ఇది మరో రాజకీయ పోరాటంగా మారనున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల బహిరంగ పోరాటానికి తమ పార్టీలోని కొందరు అంతర్గతంగా తనపై కుట్ర పన్నుతున్నారని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు సమాచారం. కాబోయే ముఖ్యమంత్రి ఎవరనేది అప్రస్తుతమైనా.. ఢిల్లీ నేతలు ఆ దిశగా చర్చలు జరిపారని సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ల నేతృత్వంలో జరిగిన రెండు సమావేశాల్లోనూ రాష్ట్ర ప్రగతిపై సుదీర్ఘంగా చర్చలు జరిగినా అంతిమ నిర్ణయం తీసుకోలేదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉండాలని సీఎం సిద్దరామయ్యకు సూచించడం ఏమని అర్థం చేసుకోవాలనే అయోమయం సాగుతోంది. చట్టపరంగా అనుకూలం కాకుంటే రాజీనామా చేయాలని స్పష్టత ఇవ్వకపోయినా డోలాయమానంలో పెట్టారు. ఢిల్లీ నుంచి సీఎం వెనుతిరిగిన వెంటనే కనకపీఠం స్వామిజీ పలువురు మఠాధిపతులతో సీఎం సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమావేశం నిర్వహించడం ద్వారా అధిష్టానానికి ఒక సందేశం ఇచ్చారు. వీటికి బలం చేకూర్చేలా రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యానని, చర్చలు ఏమిటనేది బహిరంగంగా వెల్లడించలేనని హోం మంత్రి పరమేశ్వర్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్ ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో మాత్రం సిద్దరామయ్యకు అండగా ఉన్నారు.

అనూహ్య పరిణామాలు

ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సంబంధించిన కేసు శనివారం విచారణకు వస్తున్న నేపథ్యంలో తాజాగా శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. బెంగళూరులో హోంశాఖ మంత్రి పరమేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తనకు పదోన్నతి లభిస్తే సంతోషమే అన్నారు. నాయకత్వ మార్పు జరగవచ్చుననే అనుమానాలకు పరమేశ్వర్ వ్యాఖ్యలు బలాన్నిస్తున్నాయి. గతంలో నాయకత్వ మార్పు జరిగితే దళిత సీఎం కావాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. అందుకు పరమేశ్వర్ కూడా తానేమీ రాజకీయ సన్యాసిని కాదని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మరోవైపు హోం మంత్రి పరమేశ్వర్, కీలక మంత్రి సతీశ్ జార్కిహొళితో కలసి సుదీర్ఘంగా చర్చలు జరపడం ఆసక్తికరమవుతోంది. ముఖ్యమంత్రిపై ప్రాసిక్యూషన్ అనుమతులు వచ్చాక దాదాపు ఏడాదికాలంగా బద్ధశత్రువుల తరహాలో ఉన్న సతీశ్ జార్కిహొళి, డీకే శివకుమార్ కలవడం కూడా చర్చనీయాంశమయింది. తాజాగా పరమేశ్వర్ నేరుగా సతీశ్ జార్కిహొళితో భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. సతీశ్ జార్కిహొళి నివాసానికి పరమేశ్వర్ వెళ్లారు. మీడియా పలకరించగా రాజకీయాలు లేవని భోజనానికి వచ్చానని, వంటకాలు బాగున్నాయన్నారు. సతీశ్‌జార్కిహొళి మాట్లాడుతూ శాఖాపరమైన అంశాలపై తాను చర్చలకు వెళ్లదలిచానని, కలసి భోజనం చేద్దామని పరమేశ్వర్ ఇంటికి వచ్చారని అన్నారు. శనివారం ఉదయం నుంచే కొత్త రాజకీయం ప్రారంభం కానుంది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్, ఆ తర్వాత హైకోర్టులో కేసు అంశాలు కుతూహలంగా ఉన్నాయి.

మాజీ మంత్రి శ్రీనివాస్ కన్నుమూత

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లా సాగరకు చెందిన మాజీ మంత్రి కేహెచ్ శ్రీనివాస్ (86) కన్నుమూశారు. జనతా పరివార్‌లో కొనసాగి తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణహెగ్డేకి అప్పుడిగా పేరొందారు. రైతుగా, న్యాయవాదిగా, రచయితగానే కాకుండా సినిమాల్లోనూ నటించారు. కొన్ని రోజులుగా వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ బెంగళూరులో నివసించేవారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కన్నుమూసినట్టు కుమార్తె వైశాలి శ్రీనివాస్ తెలిపారు. సాగర తాలూకా కానుగోడులో 1938 ఫిబ్రవరి 5న జన్మించిన ఆయన న్యాయవాదిగా కొనసాగుతూ రాజకీయాల్లోకి వచ్చారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన యువజన సేవలు, విద్యుత్, కన్నడ సంస్కృతి శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.



కెహెచ్ శ్రీనివాస్ (ఫైల్)

ముంపుతో ముప్పు

- గుమ్మగోళ గోడు పట్టని అధికారులు
- సురక్షిత ప్రాంతానికి తరలించడంలో నిర్లక్ష్యం
- 15 ఏళ్లుగా భయం గుప్పిట్లో జనం

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముంపుతో ముప్పు ఉందని తెలిసినా అధికారుల నిర్లక్ష్యంతో ఓ గ్రామం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకునీడుస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం తర్వాత అటువైపు అధికారులు చూడకపోవడంతో వారి ఆవేదన అరణ్యరోదనగా మారింది. సింగటాలూరు ఎత్తిపోతల పథకంలో గుమ్మగోళ గ్రామం ముంపునకు గురవుతోంది. ప్రాజెక్టుకు 3.12 టీఎంసీల నీరు చేరితే గ్రామం మునిగిపోతుంది. ఇలా 15 ఏళ్లుగా ఆ గ్రామస్థులు భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఏటా వర్షాకాలం వచ్చిందంటే సర్వస్వం కోల్పోతామనే భయం వెంటాడుతోంది. ప్రభుత్వం గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించే విషయాన్ని తీవ్రంగా పరిగణించలేదు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గదగ్ జిల్లాలో ప్రతిష్టాత్మకమైన సింగటాలూరు ఎత్తిపోతల పథకం కారణంగా ఎంతోమంది ఇళ్లు, పంట పొలాలు కోల్పోయారు. గుమ్మగోళ గ్రామస్థులు మాత్రం అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. గదగ్ జిల్లా ముండగేరి తాలూకా గుమ్మగోళ గ్రామాన్ని ప్రాజెక్టు నిర్మించినప్పుడే ఇతర ప్రదేశానికి తరలించాలనే ప్రతిపాదన ఉంది. గ్రామస్థులకు ఇళ్లు, భూములు కోల్పోయేవారికి ప్రభుత్వం పరిహారం ఇవ్వాల్సి ఉంది. గుమ్మగోళ గ్రామాన్ని తరలించేందుకు ఇక్కడికి సమీపంలోనే స్థలం కేటాయించారు. కోట్లాదిరూపాయలతో అభివృద్ధి చేశారు. సకాలంలో గ్రామస్థులకు ఇంటి స్థలాలను పంపిణీ చేయలేదు. ఆరేడేళ్లు జాప్యం చేశారు. దీంతో కొత్త గ్రామానికి వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. అప్పట్లో ఇంటి నిర్మాణం సాధారణంగానే ముగిసేది. 15 ఏళ్లు కావడంతో నిర్మాణానికి అవసరమైన వస్తువుల ధరలు పెరిగాయి. ప్రభుత్వం జాప్యం చేసి విడతలవారీగా ఇచ్చిన పరిహారం ఖర్చులకే సరిపోయింది. ప్రస్తుతం స్థానికులు సదరు స్థలానికి వెళ్లేందుకు అంగీకరించడం లేదు. ప్రభుత్వం మరోసారి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పట్లో చెల్లించిన మొత్తంతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదంటున్నారు. పునరావాసం కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి చేస్తామని, పరిహారం ఇచ్చే అంశం ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని జిల్లా యంత్రాంగం చెబుతోంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హెచ్‌కే పాటిల్, ఎమ్మెల్యే చంద్రు లమాణికి విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. గతంలో కోట్లాదిరూపాయలు ఖర్చు చేసి నిర్మించిన కమ్యూనిటీ భవనం, రోడ్లు, పాఠశాల, ఆలయం శిథిలావస్థకు చేరాయి. ప్రతి ఇంటికి రూ. 5లక్షలు పరిహారం ఇస్తేనే గ్రామం వీడతామని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తుంగభద్ర నదికి నీరు పెరిగితే సింగటాలూరు డ్యామ్ భర్తీ అవుతుంది. ప్రాజెక్టు నిండితే గుమ్మగోళ గ్రామం సంపూర్ణంగా మునిగిపోనుంది. ఇలా ఎంతకాలం ప్రతి ఏటా వర్షకాలంలో భయపడుతూ జీవించాలని గ్రామస్థులు మండిపడుతున్నారు.





సింగటాలూరు ఎత్తిపోతల పథకం, గోడు వెళ్లబోసుకుంటున్న గ్రామస్థులు

చిన్న పరిశ్రమలకు చేయూతనివ్వండి

- స్థానికంగానే ముడి సరుకు కొనుగోలు చేయండి
- కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు విదేశాల నుంచి కాకుండా స్థానికంగానే ఉండే మైక్రో, స్మాల్, మీడియం అండ్ ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ)ల నుంచి ముడి సరుకు కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఎంఎస్ఎంఇ, కార్మిక ఉపాధిశాఖ మంత్రి శోభాకరంద్లాజె తెలిపారు. ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఎంఎస్ఎంఇ మంత్రిత్వశాఖ సాయంతో ఫెడరేషన్ ఆఫ్ కర్నాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌కేసీసీఐ) ఆధ్వర్యంలో రెండు రోజుల ఎంఎస్ఎంఇ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశంలో పారిశ్రామిక రంగానికి ఎంఎస్ఎంఇల సహకారం అపారమైనదన్నారు. ఎక్కువ ఉద్యోగాల సృష్టికి ఎంఎస్ఎంఇలే కారణమని తెలిపారు. వీటిని ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం పలు ప్రాజెక్టులను రూపొందించిందని అన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గ్రాంట్లు పెంచారని అన్నారు. వికసిత భారత్ కల సాకారం కోసం మానవ వనరులకు నైపుణ్య శిక్షణల దిశగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. దేశంలో జీడీపీ పెంచేందుకు చైతన్యం అవసరమన్నారు. కొత్త పరిశ్రమలు ప్రారంభించేందుకు ఏటా 5లక్షల దరఖాస్తులు వస్తున్నాయన్నారు. తమ శాఖ నుంచి 90వేల మందికి సబ్సిడీ ఇస్తున్నామని, మరింత పెంచే ఆలోచన ఉందన్నారు. ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ రమేశ్‌చంద్ర లహోటి మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో రాష్ట్రంలో ఎంఎస్ఎంఇల ప్రగతి సుస్థిరత పెంపొందించే వాతావరణం కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌కేసీసీఐ ప్రెసిడెంట్ ఎంజీ బాలకృష్ణ, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ఉమారెడ్డి, ఇండస్ట్రీ కమిటీ చైర్మన్ అరవింద్ బుర్లి, కాసియా చైర్మన్ ఎంజే రాజగోపాల్, పీణ్యా ఇండస్ట్రియల్ అసోసియేషన్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ సదస్సు ప్రారంభంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె తదితరులు

రైతులకు శుభవార్త

- సోయాబీన్, ఉద్దులు కొనుగోలు చేస్తాం
- కేంద్ర పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విస్తారంగా సాగు చేసే ఉద్దులు, సోయాబీన్ రైతులకు మద్దతు ధరతో కొనుగోలుకు అనుమతించామని కేంద్ర పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి వెల్లడించారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయక చవితికి అన్నదాతకు అండగా నిలిచి శుభవారం చెప్పామన్నారు. రాష్ట్రంలో రైతులు సాగు చేసే మరో రెండు పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చామన్నారు. ఇప్పటికే పెసలు, పొద్దు తిరుగుడుకు మద్దతు ధర కల్పించామని, అదనంగా ఉద్దులు, సోయాబీన్ కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించామన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి మద్దతు ధరకు అనుగుణంగా 19,760 మెట్రిక్ టన్నుల ఉద్దులు, 1,01,315 మెట్రిక్ టన్నుల సోయాబీన్ కొనుగోళ్లకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఓపెన్ మార్కెట్‌లో పంట దిగుబడులకు ధర తక్కువగా ఉన్నందున మద్దతు ధర కల్పించడం ద్వారా రైతులకు అనుకూల చేయదలిచామన్నారు. రాష్ట్రంలో 90 రోజుల వ్యవధిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఉద్దులు, సోయాబీన్ కొనుగోలు చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ గురువారం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇటీవలే పెసలు, పొద్దుతిరుగుడుకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. రాష్ట్ర రైతుల సమస్యలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పందించారని తెలిపారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

నగరంలో పలుచోట్ల వర్షం



కార్యాచరణలో బీబీఎంపీ సిబ్బంది

బెంగళూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసింది. మైసూరు రోడ్డులోని నాయండహళ్లి ఫ్లై ఓవర్‌పై వర్షపునీరు నిలిచిపోవడంతో అత్యవసరంగా బీబీఎంపీ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. ఓ మోస్తరు వర్షం కురుస్తుండగానే సిబ్బంది పీపీఈ కిట్‌ను ధరించి ఫ్లై ఓవర్‌పై వర్షపునీరు సజావుగా వెళ్లేలా కృషి చేశారు.




సత్యసాయి సేవలు అద్వితీయం

- మహా సమాధిని దర్శించుకున్న ధర్మస్థల ధర్మాధికారి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30: సత్యసాయిబాబా మానవాళికి అందించే సేవలు అద్వితీయమని ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డే కొనియాడారు. శుక్రవారం ఆయన ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా మానవాళికి ఆధునాతన వైద్యసేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. మానవతావిలువలతో కూడిన విద్యను అందించి సత్యసాయి మహోన్నతమూర్తిగా నిలిచారని తెలిపారు. అవతార మూర్తి శివైక్యం అనంతరం కూడా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవా కార్యక్రమాలను ప్రపంచవ్యాప్తంగా అందిస్తుండటం అద్భుతం అన్నారు. ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకునే దశలో తాను 20 కిలోమీటర్ల దూరం నుంచే సత్యసాయి దివ్య ప్రకంపనల అనుభూతిని పొందానని తెలిపారు. అంతకు మునుపు ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డేకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, మనోహర్‌శెట్టి ఘనస్వాగతం పలికారు. సత్యసాయి జ్ఞాపికను అందచేసి సన్మానించారు.



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్డే



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.56	1,625.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	34,083	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,067	7,659
సామర్థ్యం (టీఎంసీలు)	92.42	77.81

టీబీ డ్యాంకు పూర్వజలకళ



92 టీఎంసీల వరదనీరు చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తున్న తుంగభద్ర డ్యాం

తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు 92 టీఎంసీలు దాటాయి. డ్యాంలోకి 33 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. డ్యాం ఎగువ భాగాన ఉన్న మలెనాడు ప్రాంతంలో రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా శుక్రవారం లెక్కల ప్రకారం 93.16 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయి. వివిధ కాలువల ద్వారా 10,067 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున డ్యాంలో 77.808 టీఎంసీల నిల్వలు ఉండేవి. ఈ ఏడాది డ్యాం త్వరగా నిండినా.. 19వ క్రస్ట్ గేట్ కొట్టుకుపోవడంతో సుమారు 31 టీఎంసీల నీరు నదిలోకి వెళ్లింది. డ్యాం మరోసారి నిండుతుండటంతో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు అంటున్నారు. -బళ్లారి

సకాలంలో రిటర్నులు సమర్పించాలి



మాట్లాడుతున్న వాణిజ్య, పరిశ్రమల శాఖాధికారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 30: పన్నుచెల్లింపు దారులు గడువులోగా రిటర్నులు చెల్లించి పెనాల్టీ పడకుండా చేసుకోవాలని బళ్లారి జిల్లా వాణిజ్య, పరిశ్రమల శాఖ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి తెలిపారు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ, ఐసీఏఐకి చెందిన ఎస్‌ఐఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదాయ పన్ను శాఖ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. తదనంతరం సీఏ రాజశేఖర్ మాట్లాడుతూ పన్ను చెల్లించేటప్పుడు పన్ను చెల్లింపుదారులు అనుసరించాల్సిన నియమాలు, సమర్పించాల్సిన అనుబంధ పత్రాలు, పన్ను మదింపు, చెల్లింపు వంటి వివిధ అంశాలపై వివరించారు. ఆదాయపు పన్ను శాఖకు సరైనపత్రాలు సమర్పించాలని, వాటి నకళ్లను దాచిపెట్టుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐఆర్‌సీ ఆఫ్ ఐసీఏఐ బళ్లారి శాఖ అధ్యక్షుడు సీఏ వెంకటనారాయణ, కార్యదర్శి స్వప్నప్రియ, సీఏ రాజేశ్ బగ్రేచా తదితరులు మాట్లాడారు. ఉపన్యాస శిబిరంలో వాణిజ్య పరిశ్రమల మండలి ఛైర్మన్ మహారుద్ర గౌడ, గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, మల్లికార్జున గౌడ, రామచంద్ర, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, చార్టర్ అకౌంటెంట్లు, ఇతర సంఘాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ అమలు



బళ్లారి సిటీ, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన విధంగా బళ్లారి జిల్లాలో రిజిస్ట్రేషన్ విధానాన్ని విస్తరింపచేశామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. ప్రస్తుతం స్థిరాస్తికి సంబంధించిన పత్రాన్ని ఆ ప్రాంతంలోనే కాకుండా మరి ఏ ఇతర రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనయినా నమోదు చేసుకోవచ్చునన్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లో పారదర్శకతను పెంచే ఎనీవేర్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ప్రజలకు అనేక విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానం రిజిస్ట్రేషన్‌లో జాప్యాన్ని నివారిస్తుందన్నారు. ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ అందుబాటులో ఉన్న కార్యాలయాన్ని ఎంచుకోవచ్చునన్నారు. ఇది రిజిస్ట్రేషన ప్రక్రియను సులభతరం చేయడమే కాకుండా సమయాన్ని కూడా ఆదా చేస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ తగ్గుతుందన్నారు. కావున ప్రజలు ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార భద్రత అధికారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 30: మహానగర పాలక సంస్థ పరిధిలోని స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు, హోటళ్ళు, రెస్టారెంట్లను శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సందర్శించి ఆహార నాణ్యతపై తనిఖీ నిర్వహించారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ క్వాలిటీ యాక్ట్ 2006 పాటించకపోవడం, ఫుడ్ హ్యాండ్లర్ల వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారంలో ఉపయోగించే కృత్రిమ రంగు అజినోమోటో(టేస్టింగ్ పౌడర్), ఆహార తయారీకి ఉపయోగించే నీరు, తాగడానికి వినియోగదారులకు అందించిన నీరు తదితర నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం ఆహార ప్రయోగశాలకు పంపారు. విశ్లేషణ నివేదిక అందిన తర్వాత ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నందకాడి తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలపై వ్యాపారులకు జరిమానాలు కూడా విధించారు. తనిఖీల్లో వెల్లడైన లోపాలను వారం రోజుల్లో సరిదిదుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఆహార భద్రత, నాణ్యతవిభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎంసీ ఆవరణలో అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

కంప్లి, ఆగస్టు 30 : పీఎంసీ ఆవరణ నుంచి అక్రమంగా వేసుకున్న ఓ షెడ్డు, విషపూరితమైన మొక్కల తొలగింపునకు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వగా వెంటనే ఈ ఏపీఎంసీ అధ్యక్షులు అంజినప్ప ఆదేశాలిచ్చారు. దీంతో వెంటనే పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 32 కోనోకార్పస్ మొక్కలను, అక్రమంగా వేసిన షెడ్డును తొలగించారు. ఈ విషయంపై ఏపీఎంసీ అధ్యక్షుడు మాట్లాడుతూ గతంలో రోడ్డుకు అడ్డంగా వేసిన మొక్కలను, షెడ్డును తొలగించాలని పలుమార్లు తెలిపినా యజమాని నిర్లక్ష్యం వహించడంతో సభలో తీర్మానం తీసుకుని షెడ్డును తొలగించామని తెలిపారు. ఏపీఎంసీ ఆవరణ ముందు ఎలాంటి అనుమతులు లేకుండా అనారోగ్యం పాలు చేసే కోనోకార్పస్ మొక్కలను నారాయణస్వామి పెంచడంతో ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారన్నారు. వారితోపాటు కార్యదర్శి రాజు, అధ్యక్షులు శరణు గౌడ, ఏపీఎంసీ సభ్యులు, పోలీసు శాఖ తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు వీడి ఐక్యతతో ముందుకు రావాలి



సోమసముద్రంలో మధుకరి నాయక విగ్రహ ప్రతిష్ఠాపనలో స్వామి

కంప్లి, ఆగస్టు 30 : వాల్మీకి సమాజంలో ప్రతి ఒక్కరు మనస్పర్థలు వదిలి ఐక్యతతో ముందుకు రావాలని రాజేనళ్లి పీఠాధీశ్వరులు ప్రసన్నానందాపురి స్వామి తెలిపారు. కురుగోడు తాలుకా పరిధిలోని సోమసముద్రం గ్రామంలో వాల్మీకి విగ్రహం, మధుకరి నాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా తమ వాల్మీకి సమాజానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ప్రతి ఒక్కరు సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే వాల్మీకులకు రిజర్వేషన్‌ను కూడా పెంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయంగా, ఆర్థికంగా మెరుగుపడాలన్నారు. అలాగే నాయకులు పార్టీలను విడనాడి ముందుకొచ్చినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సారి ఫిబ్రవరిలో జరిగే వాల్మీకి జాతరను రాష్ట్రంలో గుర్తుండిపోయేలా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే జేఎన్ గణేష్, మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, సోమసముద్రం వాల్మీకి సమాజ పదాధికారులు, జిల్లాలోని పలువురు వాల్మీకి సమాజ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



కంప్లి పట్టణంలో క్రిమిసంహారకాలను పిచికారి చేస్తున్న సిబ్బంది

కంప్లి, ఆగస్టు 30: పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్తగా క్రిమిసంహారకాలను పిచికారీ చేస్తున్నారు. పట్టణాలలో ఏర్పడిన చెత్తాచెదారాన్ని కూడా జోరుగా తొలగిస్తున్నారు. కుడితిని పట్టణంలో హరిగిణదోణి రోడ్డు, వాల్మీకి పాఠశాలవద్ద చెత్తాచెదారాన్ని ముళ్లకంచెలను తొలగించడంలో నూతన అధ్యక్షురాలు బసమ్మ, చంద్రప్పలు నిమగ్నమయ్యారు. బాధ్యతలుతీసుకున్న మొదటిరోజే పట్టణ అభివృద్ధిపై ముందడుగు వేశారు. ప్రతి ఒక్కరు తమ పరిధిలో పరిసరాలను స్వచ్ఛంగా వుంచుకుని ఆరోగ్యాలు కాపాడుకోవాలని సూచించారు. అలాగే కంప్లి పట్టణంలో కూడా ప్రతి వార్డులో రోగాల బారినపడకుండా నీరు నిల్వ వున్న చోట మందులను పిచికారి చేయిస్తున్నారు. మొత్తానికి ఇక్కడ అధికారులు, పట్టణ పంచాయతీ అధ్యక్షులు పట్టణ ఆరోగ్యంపై దృష్టి సారించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న మేయర్ నందీష్

బళ్లారిరూరల్, ఆగస్టు 30 : బళ్లారి నగరం పటేల్ నగర్ ప్రాంతంలో ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలను మేయర్ నందీష్ శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులతో మాట్లాడి రోడ్డు వెడల్పు పనులు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

పొగాకు దుకాణాలపై అధికారుల దాడి

బళ్లారి సిటీ, ఆగస్టు 30: సండూర్ తాలూకా తోరణగల్లు పోలీస్ పరిధిలో అనుమతి లేకుండా పొగాకు విక్రయిస్తున్న సుమారు 20దుకాణాలపై పొగాకు నియంత్రణ సెల్ అధికారులు శుక్రవారం దాడులు చేసి జరిమానా విధించారు. అనంతరం పొగాకు విక్రయదారులకు కోట్పా చట్టం 2003 గురించి అవగాహన కల్పించారు.

బాధ్యతలు చేపట్టిన సిరుగుప్ప అధ్యక్ష, ఉపాధ్యక్షులు



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

సిరుగుప్ప, ఆగస్టు 30 : నగరసభ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అధికార బాధ్యతలు స్వీకరించారు. సిరుగుప్ప పట్టణం నూతతనంగా ఎన్నికైన నగరసభ అధ్యక్షులు రేణుకమ్మ, ఉపాధ్యక్షులు యశోద శుక్రవారం పూజలు జరిపి అధికార బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు రేణుకమ్మ మాట్లాడుతూ నగరంలో తాగునీరు, మ్యుటేషన్, ఫారమ్ 3 సమస్యలు లేకుండా చూసుకుంటామని తెలిపార. ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్న వెంకటేష, యువ కాంగ్రెస్ నాయకులు క్యాదిగల్ రేణుకారాజుపవన్‌కుమార్, కార్యకర్తలు, నగరసభ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ద్విచక్రవాహనం ఆవిష్కరణ



నూతన ద్విచక్రవాహనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,ఆగస్టు 30: ద్విచక్రవాహనాల్లో టీ.వి.ఎస్ కంపెనీకి చెందిన జూపిటర్ 110సీసీ ద్విచక్రవాహనం మేటి అని భారతీయ స్టేట్ బ్యాంకు అధికారి మిథున్ పేర్కొన్నారు. శుక్రవారం బాలాజీ టీ.వి.ఎస్ షోరూంలో నూతనంగా అధునాతన సాంకేతిక మార్పులతో తయారీ చేసిన జూపిటర్ 110సీసీ వాహనాన్ని ఆయన అవిష్కరించి మాట్లాడారు. గత 11ఏళ్లుగా ఈ వాహనాలు పలు మోడళ్లలో అందుబాటులోకి తెచ్చారని వినియోగదారులకు అనుగుణంగా తీర్చిదిద్దారని బాలాజీ గ్రూప్ సంచాలకుడు మురళీకృష్ణరెడ్డి తెలిపారు. మన దేశంలో 65మిలియన్ల ద్విచక్రవాహనాలను ప్రజలు వాడుతున్నారని తెలిపారు. ఆరు రంగుల్లో ఈ వాహనాలు లభిస్తాయని తెలిపారు. బళ్లారిలో తొలిరోజు పది వాహనాలను కొనుగోలుచేసి తీసుకెళ్లారని తెలిపారు. ఎస్‌బీఐ అధికారి కుమారస్వామి, ఆనంద్, ప్రశాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమశాఖ తాలుకా డైరెక్టర్‌గా మద్దేరి సిద్దయ్య



సిరుగుప్ప, ఆగస్టు 30: సిరుగుప్ప తాలుకా సాంఘీక సంక్షేమశాఖ డైరెక్టర్‌గా మద్దేరి సిద్దయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు వున్న డైరెక్టర్ రాజేశ్వరి వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దేరి సిద్దయ్య అధికార బాధ్యతలు స్వీకరించారు. సాంఘీక సంక్షేమ శాఖకు సంబంధించి హాస్టల్‌లలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

కేడబ్ల్యూజేవీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గిరియాదవ్



నూతనంగా ఎన్నికైన సభ్యులు

బళ్లారిరూరల్, ఆగస్టు 30: బళ్లారి ఇండియన్ గెస్ట్ హౌస్ ఆవరణలో కంప్లి, కురుగోడు, బళ్లారి కేడబ్ల్యూజేవీ సంఘం అధ్యక్ష ఎన్నికలు శుక్రవారం రాజ్యఅధ్యక్షులు మంగ్లి మల్లికార్జున నేతృత్వంలో నిర్వహించారు. జిల్లాఅధ్యక్షుడిగా గిరియాదవ్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభాకర్, ఉపాధ్యక్షులు భీమన్న, చంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగాలకు నైపుణ్యం ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న దేబబ్రత్ తదితరులు

బళ్లారి సిటీ, ఆగస్టు 30: ప్రస్తుత పరిస్థితిల్లో ఉద్యోగాలకు నైపుణ్యాభివృద్ధి అవసరమని జేఎస్‌డబ్ల్యూ హ్యూమన్ రిసోర్సెస్ ఇన్‌చార్జి దేబబ్రత్ అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీ మేధా కళాశాల 10వ సంవత్సర వేడుకల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఉద్యోగానికి కావల్సిన నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శ్రీమేధా కళాశాల వ్యవస్థాపకుడు, ప్రిన్సిపాల్ రామ్‌కిరణ్ మాట్లాడుతూ కళాశాల సాధించిన విజయాలు, రాబోయే మూడు సంవత్సరాల ఔట్‌లుక్ గురించి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లితండ్రులు, బీబీఏ, బీసీఏ, బీకాం విభాగాల అధిపతులు, భాషా విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

అనుమతి లేని బ్యానర్ల తొలగింపు



బ్యానర్లను తొలగించి తీసుకువెళుతున్న సిబ్బంది

హోసూరు(సిఫ్‌కాట్) ఆగస్టు 30: హోసూరు పరిధిలో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా పలుచోట్ల ఏర్పాటుచేసిన పోస్టర్లు, బ్యానర్లను శుక్రవారం సిబ్బంది తొలగించారు. ఇంతవరకు ఎక్కడెక్కడ అక్రమపోస్టర్లు ఉంచారో వాటిని మొత్తం తొలగించాలని అధికారులు ఆదేశించడంతో మున్సిపల్ కార్మికులు 206 చోట్ల పోస్టర్లను తొలగించారు. ఎక్కడబడితే అక్కడ పోస్టర్లును అతికించరాదని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ హెచ్చరించారు. అనుమతి తర్వాతే బ్యానర్లు పెట్టాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వానికి చెందిన ప్రాంతాల గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించరాదని, పెళ్లి, రిసెప్షన్, పుట్టినరోజులు, షాపు ఓపెనింగ్, ఇటువంటి వన్ని రద్దు చేయాలని, అనుమతి పొందిన తర్వాతే బ్యానర్లు పెట్టాలని కోరారు. అనుమతి లేకుండా పోస్టర్లు, అనుమతి లేకుండా ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హోసూరు ఆగస్టు 30: హోసూరు సమీపంలోని జూజూవాడీ సబ్ స్టేషన్ వద్ద అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సిఫ్‌కాట్ ఏరియా 1, 2, 3, 4 మూకొండపల్లి, ఎంజీఆర్ నగర్, రాజాజీనగర్, అరసనట్టి, చిట్కో ఏరియా 4,5,6,7 ఇండస్ట్రీయల్ ఏరియాప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

తగ్గిన పూల ధరలు

హోసూరు, ఆగస్టు 30: హోసూరు పూలమార్కెట్‌లో పూల సరఫరా అమాంతంగా పెరగడం, తగినంత డిమాండ్ లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. హోసూరు బస్టాండు ఎదురుగా ఉన్న పూల మార్కెట్‌లో శ్రావణ శుక్రవారం అయినప్పటికి కూడా పూల ధరలు తగ్గుముఖం పట్టాయి. గుండుమల్లి కిలో రూ.240, చెండుమల్లి కిలో రూ.30, గులాబీ కిలో రూ.80 వంతున విక్రయిస్తున్నారు.

కార్మికులకు సభ్యత్వ కార్డుల పంపిణీ

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 30: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ వెనుకబడిన 26 మందికి మైనారిటీ సంక్షేమ శాఖ తరఫున గుర్తింపు కార్డులు అందజేశారు. అలాగే రూ.1.32 లక్షలతో కుట్టుమిషన్లు, అందజేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంల్లో రోస్లిన్ జీవా, రాష్ట్ర క్రైస్తవ పోస్టరల్ వెల్ఫేర్ బోర్డు సభ్యురాలు, పాల్గొన్నారు. కృష్ణగిరి జిల్లాలోని క్రైస్తవ చర్చిలలో పనిచేస్తున్న బోధకులు, కార్మికులకు కూడా సంక్షేమ గుర్తింపు కార్డులు అందించారు. కార్యక్రమంలో వెనుకబడిన వర్గాల సంక్షేమాధికారిణి పద్మలత , శాఖాధికారులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులు అందుకున్న చర్చి బోధకులు, కార్మికులతో కలెక్టర్

తనదాకా వస్తేగానీ..

రోడ్డు గుంతలో ఇరుక్కున్న అధికారి కారు..!



రోడ్డు గుంతలో ఇరుక్కుపోయిన ఇంజనీరు కారు

రాయచూరు, ఆగస్టు 30 : ఏదైనా తనదాకా వస్తేగాని తత్వం బోధపడతంటారు. జిల్లాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అధికారి కారు ఒకటి శుక్రవారం కవితాళ పట్టణం నడిరోడ్డులో కూరుకుపోయింది. రోడ్డు విస్తరణలో భాగంగా డివైడర్‌లు ఏర్పాటుచేసే పనులు అస్తవ్యస్తంగా సాగుతున్న క్రమంలో రోడ్డుపై ఎక్కడపడతే అక్కడ గుంతలు తవ్వారు. ప్రజలు ఆరోడ్డులో వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం రాకతో గుంతల్లో నీళ్లు ఆగి ఉండగా గుంతల లోతు తెలియకపోవడంతో వాహనాన్ని దాటించే క్రమంలో ఒక్కసారిగా గుంతలో కారు కూరుకుపోయింది. దీన్ని గమనించిన ఇరుగు-పొరుగువారు సహాయంగా వచ్చి అధికారి కారును ఎలాగోలా బయటికి తీశారు. ఇప్పటిదాకా జనం ఇబ్బందులు పడుతూ ఎన్నిఅర్జీలు మొరపెట్టుకున్నా అయ్యగారికి ఏమీ అర్థంకాలేదు. అదే తనదాకా వచ్చేసరికి పరిస్థితి అర్థమైంది. ఇంకేముంది దేవుడా! రాముడా అంటూ ఇంటిదారి పట్టారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



కనక మృతదేహం

రాయచూరు, ఆగస్టు 30: జిల్లాలోని మాన్వి తాలూకా సంగాపూరం గ్రామంలో విద్యుత్ తీగలు తగడంతో 28 ఏళ్ల కనక మృత్యువాతపడ్డాడు. గ్రామదేవతగా కొలుచుకునే తాయమ్మదేవికి శ్రావణమాసం చివరి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దేవాలయానికి విద్యుత్‌దీపాల అలంకరణ చేపట్టారు. ఈ క్రమంలో అలంకరణ చేస్తుండగా పొరపాటున విద్యుత్ తీగలు తాకడంతో కనక మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న మాన్వి పట్టణ పోలీసులు సంఘటన సలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాలూకా ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి మాన్వి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయస్...

మరియ మాంటిస్సోరి (జయంతి)



ఇటలీ దేశానికి చెందిన డాక్టర్, విద్యావేత్త మరియ టెక్లా ఆర్టెమి సియా మాంటిస్సోరి 1870 ఆగస్టు 31న జన్మించారు. చిన్నారులకు 'ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్'లో ఆమె ప్రతిపాదించిన అంశాలు ఎంతో పేరొందాయి. మాంటిస్సోరి మెథడ్‌గా పేరొంది 20 భాషల్లో అనువాదమయ్యాయి. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ఆమె విధానాలలో పాఠాలు కొనసాగుతున్నాయి. 1949, 50, 51లో వరుసగా నోబెల్ శాంతి పురస్కారానికి నామినేట్ అయ్యారు. 1952 మే 6న కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం భారత్ సహా పలు దేశాలలో పోస్టల్ స్టాంపులు విడుదలయ్యాయి.

ఆదిభట్ల నారాయణదాసు (జయంతి)




హరికథా పితామహగా పేరొందిన అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగస్టు 31న విజయనగరం జిల్లా అజ్జాడ గ్రామంలో జన్మించారు. కళాకారుడు, సంగీతం, సాహిత్యం, నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియలో సరికొత్త ఒరవడి తెచ్చారు. తెలుగు, సంస్కృతాలలో శతాధిక రచనలు చేశారు. కవి, బహు భాషా కోవిదుడు, తాత్వికుడు. తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, ఉర్దూ, ఆంగ్లం, అరబ్బీ, పార్శీ భాష లలో ప్రావీణ్యం పొంది అష్టావధానాలు చేశారు. 1945 జనవరి 2న కన్నుమూశారు.

ఆరుద్ర (జయంతి)




ప్రముఖ రచయిత ఆరుద్ర 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల సదాశివ శంకరశాస్త్రి. తెలుగు సాహిత్యంలో అపారమైన పట్టు కలిగి రచయితగా, కవిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అనువాదకులుగా, పబ్లిషర్‌గా రాణించారు. శ్రీశ్రీ మేనల్లుడైనా సొంత ప్రతిభతో రాణించారు. 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' రచన తెలుగు సాహిత్యంపై అధ్యయనం చేసే వారికి గొప్ప గ్రంథం. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకుల్లో ఒకరు. సుమారు 4వేల సినిమా పాటలు రాశారు. టాలీవుడ్‌లో ఎన్నో కథలు, పాటలు రాశారు. సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 1998 జూన్ 4న కన్నుమూశారు.

బాపు (వర్ధంతి)



అందాల భామను వర్ణించడానికి బాపు బొమ్మగా పిలుస్తుంటారు. అంతగా తెలుగువారి సంస్కృతిలో బాపు బొమ్మ, రాత భాగమయ్యాయి. ఆయన అసలు పేరు సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ. 1933 డిసెంబరు 15న పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం కంతేరు గ్రామంలో జన్మించారు. సినీ దర్శకుడిగా, చిత్రకారుడిగా, కార్టూనిస్ట్‌గా, స్క్రీన్ రైటర్‌గా బహుముఖ ప్రజ్ఞతో రాణించారు. ఆయన వేసిన కార్టూన్‌లు, పుస్తకాల ముఖ చిత్రాలకు లెక్కలేదు. తెలుగు సినీరంగంతోపాటు బాలీవుడ్‌లోనూ గుర్తింపు పొందారు. బాపు, ముళ్ళపూడి రమణ ద్వయంలో ఎన్నో సినిమాలు వచ్చాయి. రెండు జాతీయ పురస్కారాలు, ఏడు నంది అవార్డులు, జీవి తసాఫల్య పుర స్కారాలు, పద్మశ్రీ, కళాప్రపూర్ణ పుర స్కారాలు అందు కున్నారు. 2014 ఆగస్టు 31న కన్నుమూశారు.

ప్రణబ్ ముఖర్జీ (వర్ధంతి)



'భారతరత్న' గ్రహీత ప్రణబ్ ముఖర్జీ 1935 డిసెంబరు 11న పశ్చిమ బెంగాల్‌లో జన్మించారు. 13వ రాష్ట్రపతిగా 2012 నుంచి 2107 వరకు వ్యవహరించారు. కాంగ్రెస్‌లో ఐదు దశాబ్దాలపాటు విభిన్న హోదాల్లో కొనసాగారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు. రచనపై ఆసక్తితో కొన్ని పుస్తకాలు రాశారు. పద్మ విభూషణ్, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2020 ఆగస్టు 31న కన్నుమూశారు.

తురగా జానకీరాణి (జయంతి)



'రేడియో అక్కయ్య'గా గుర్తింపు పొందిన తురగా జానకీరాణి 1936 ఆగస్టు 31న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. ఆలిండియా రేడియోలో రెండు దశాబ్దాలకుపైగా వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిన్నపిల్లల కథలు, మూడు నవలలు, ఐదు పుస్తకాలు, రేడియో నాటికలు రచించారు. ఆకాశవాణి జాతీయ పురస్కారాన్ని నాలు గుసార్లు అందుకున్నారు. నిశ్శబ్దంలో ప్రేమనాదాలు, ఆశ్చర్యం డాక్యుమెంటరీలు, పిల్లలచే కోరస్ పాటలు పాడించి ప్రత్యేక గుర్తింపు పొందారు. దూరదర్శన్‌లో భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చారు. 2014 అక్టోబరు 15న కన్నుమూశారు.

జవగళ్ శ్రీనాథ్ (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ జవగళ్ శ్రీనాథ్ కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా అరసికెరె తాలూకా జవగళ్ ప్రాంతంలో 1969 ఆగస్టు 31న జన్మించారు. ప్రస్తుతం కామెంటేటర్‌గా, ఐసీసీ మ్యాచ్ రెఫరీగా వ్యవహరిస్తున్నారు. దేశంలో ఫాస్ట్‌బౌలర్‌గా వన్డే మ్యాచ్‌లలో అనిల్‌కుంబ్లే తర్వాత 300కుపైగా వికెట్‌లు పొందిన రెండో వ్యక్తి. 1999లో అర్జున అవార్డు పొందారు. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీగా యువ క్రికెటర్లను ప్రోత్సహిస్తున్నారు. 2003 వరల్డ్ కప్ పోటీల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

11 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా ఇసుక

పుట్టపర్తి, ఆగస్టు 30: ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని సెప్టెంబరు 11 నుంచి అమలులోకి తెస్తున్నామని, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయన జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, గనులశాఖ అధికారి రాంమోహన్ పాల్గొన్నారు. ఇసుకకు సంబంధించిన 18005 994599 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యా దులు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు.

ప్రయోగాలు మేధస్సును పెంచుతాయి

» ప్రయోగ సలహా మండలి సభ్యుడు పీఆర్ కృష్ణస్వామి

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ప్రయోగాలు మేధస్సును పెంచుతాయని స్వతంత్రంగా ఆలోచించే శక్తిని కలిగిస్తాయని ప్రయోగ సలహా మండలి సభ్యుడు పీఆర్ కృష్ణస్వామి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కనకపుర రోడ్డులోని స్టేట్ ఆర్ట్ క్యాంపస్‌లో కార్యక్రమం జరిగింది. 28 హైస్కూళ్ల విద్యార్థులచే గ్రీన్ కెమిస్ట్రీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్, ఎర్త్ సైన్సెస్ అంశాలపై ప్రాజెక్టుల అన్వేషణ ప్రయోగ ద్వారా ప్రదర్శింపచేశారు. కేంద్రప్రభుత్వ ప్రాథమిక విద్య, అక్షరాస్యత శాఖ మాజీ కార్యదర్శి అనిల్ స్వరూప్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగియున్న ప్రతిభను వెలికితీసేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. 38ఏళ్లపాటు సివిల్ సర్వీస్‌లో సేవలందించానని, ప్రాథమిక విద్య విభాగంలో సుదీర్ఘకాలం పనిచేశానన్నారు. ప్రయోగ మేనేజింగ్ ట్రస్టీ వల్లీశ్ హేరూరు మాట్లాడుతూ చిన్నవయస్సులోనే ఆవిష్కరణల స్ఫూర్తి సంతోషకరమన్నారు. యువ పరిశోధకులకు పర్యావరణ వ్యవస్థను కల్పించడం అవసరమన్నారు.



విద్యార్థులకు ప్రముఖుల సూచనలు

బీఓబీ ద్వారా రూ.60 లక్షల బీమా పంపిణీ

కేఎస్ఆర్‌పీ అసిస్టెంట్ కమాండెంట్ కుటుంబానికి



అసిస్టెంట్ కమాండెంట్ ప్రభాకర భార్య రేణుకకు చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక స్టేట్ రిజర్వు పోలీస్ (కెఎస్ఆర్‌పి) అసిస్టెంట్ కమాండెంట్ టి ప్రభాకర ప్రమాదంలో మృతి చెందిన మేరకు కుటుంబ సభ్యులకు బ్యాంక్ ఆఫ్ బరోడా 60లక్షల రూపాయల బీమాను విడుదల చేసింది. ఇటీవల కోరమంగల బ్యాంకు శాఖలో బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ హెడ్ ఇంద్రమోహన్‌సింగ్, డిజిఎం ప్రశాంత్ అవహాద్‌ల ఆధ్వర్యంలో 60లక్షల బీమా మొత్తాన్ని అందించారు. పోలీసు శాలరీ అకౌంట్ ప్యాకేజీలో భాగంగా ఖాతాదారులకు ఉచితంగా అందించే బీమా ద్వారా పరిహారం ఇచ్చామని ఇంద్రమోహన్‌సింగ్ తెలిపారు. బీమా చెక్కును ప్రభాకర్ భార్య రేణుకకు అందించారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఎయిర్ కమాండ్ తరుణ్‌కుమార్ సిన్హా, బ్రాంచ్ హెడ్ అరవింద్, మూడో బెటాలియన్ ముఖ్యులు బసవరాజ్ జిల్లా, జనార్దన్, అసిస్టెంట్ కమాండెంట్ ప్రవీణ్‌కుమార్ పటేల్‌లు పాల్గొన్నారు. 2024 మే 14న రాష్ట్ర పోలీసులతో బ్యాంక్ ఆఫ్ బరోడా చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా వ్యక్తిగత ప్రమాద బీమా అందిస్తోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

భవిష్యత్ ఆలోచనలు ఉంటేనే సంస్థ అభివృద్ధి

» డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ టీఎం కొట్రేశ్

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు ఆలో చనలు ఉంటేనే ఏ సంస్థ అయినా అభివృద్ధి సాధ్యమని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ టి.ఎం.కొట్రేశ్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ అకాడమీ కళాశాల సంస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇండియన్ అకాడమీ స్కూల్ ఆఫ్ మేనేజిమెంట్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ రీనాశ్యామ్, ప్రిన్సిపాల్ ఎన్ తిళగ, వైస్ ప్రిన్సిపాల్ మీనాచి సుందరం ముఖ్యులుగా పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి డాక్టర్ కొట్రేశ్ మాట్లాడుతూ ఉత్తమ నాయకత్వం, గుణాత్మకమైన విద్యకు ప్రాధాన్యత ఇచ్చినందునే ఇండియన్ అకాడమీ ఎదుగుదలకు కారణమైందన్నారు. ఇండియన్ అకాడమీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ టి.సోమశేఖర్ మాట్లాడుతూ సమాజం, అభివృద్ధి కోసం కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కన్వెన్షనల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ స్టిల్ రిలెవెంట్, టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ డిస్రప్షన్ ఎరా అనే అంశంపై 25 కళాశాలల విద్యార్థులచే చర్చాగోష్ఠి జరిపారు.



కొట్రేశ్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ఇండియన్ అకాడమీ ముఖ్యులు

ఎలెక్రామా సదస్సులో భాగస్వామ్యులు కండి

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎలెక్ట్రావర్స్ స్పార్క్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రికల్ షో ఎలెక్రామాలో భాగస్వామ్యులు కావాలని ఛైర్మన్ విక్రమ్ గందోత్రా పిలుపునిచ్చారు. 2025 ఫిబ్రవరి 22నుంచి ఐదు రోజులపాటు గ్రేటర్ నోయిడాలో జరిగే సదస్సుపై శుక్రవారం నగరంలో ముందస్తు సమావేశం నిర్వహించారు. 16వ విడత జరిగే అతిపెద్ద సదస్సులో స్టార్టప్‌లతోపాటు నూతన ఆవిష్కరణలపై ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 1100కుపైగా ఎగ్జిబిటర్స్ 4లక్షలమంది సందర్శకులు, 80 దేశాలనుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఛైర్మన్ సునిల్‌సంఘ్వి మాట్లాడుతూ ఎలక్ట్రికల్స్ రంగంలో మారుతున్న సాంకేతికతను ప్రదర్శింప చేసేందుకు ఇదో వేదిక కానుందన్నారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు.



ఎలెక్రామా సదస్సు పోస్టర్ల ఆవిష్కరణలో ప్రముఖులు

బాల్య వివాహాల నియంత్రణపై జాగృతి

బంగారపేట, ఆగస్టు 30: స్వాతంత్ర్యం లభించి దశాబ్దాలు గడుస్తున్నా మహిళలపై అత్యాచార ఘటనలు ఇంకా కొనసాగుతుండడం విచారకరమని జనవాది మహిళా సంఘం రాష్ట్ర ప్రముఖులు వి.గీతా అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని బాలికల పీయూ కళాశాల ఆవరణలో ఫోకస్ స్వయం సేవా సంస్థ, జనవాది మహిళా సంఘం, స్త్రీ శిశుసంక్షేమ కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ చట్టాలపై జాగృతిలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులలో కూడా బాధ్యత పెరగాలని అభిప్రాయ పడ్డారు. ఇకనైనా స్వాభిమా నంతో మెలగాలన్నారు. సీడీపీఓ మునిరాజు మాట్లా డుతూ బాల్య వివాహాల నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. కొన్ని చోట్ల జరిగే పొరపాట్లకు చెక్ పెట్టాలన్నారు. ఫోకస్ సంస్థ అధ్యక్షుడు అ.నా.హరీశ్, ఎస్సై సింగ్, ఏఎస్సై బాను, ప్రిన్సిపాల్ సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.



జాగృతిలో పాల్గొన్న సంస్థ ప్రముఖులు, విద్యార్థులు

హొసరోడ్డులో ఉచిత ఆరోగ్య శిబిరం

బొమ్మనహళ్ళి, ఆగస్టు 30: స్థానిక హొసరోడ్డు ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ కేబుల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత శిబిరం నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ సిబ్బంది పాల్గొని చికిత్సలు అందించారు. బీపీ, షుగర్‌తోపాటు పలు రకాల సమస్యలకు అవసరమైన వారికి ఔషధాలు పంపిణీ చేశారు. 400మందికిపైగా స్థానికులు పాల్గొని ప్రయోజనం పొందారు. శ్రీనివాస్ పుట్టినరోజును ఆయన అభిమానులు ఆరోగ్య శిబిరం ద్వారా అర్థవంతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవలో భాగంగా 630 మందికి చీరలు పంపిణీ చేశారు. బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే కృష్ణప్ప, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి తదితరులు

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న బస్సు

» వర్షంతో పవర్‌కట్ .. తప్పిన పెను ప్రమాదం

చింతామణి, ఆగస్టు 30: పట్టణ శివారులోని జాతీయ రహదారి ఎంజి రోడ్డు 31పై తిమ్మసంద్ర వద్ద ప్రైవేట్ బస్సు ఒకటి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. బస్సు ముందుభాగం నుజ్జయ్యినా ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊరటనిచ్చినట్టయ్యింది. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు హిందూపురం నుంచి చింతామణి మార్గంలో కోలారుకు వెళ్తున్న బస్సు అదుపు తప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీ కొంది. అప్పటికే వర్షం కురుస్తున్న కారణంగా పవర్ కట్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులోని ప్రయాణీకులను రక్షించారు. బెస్కాం సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొని బస్సును దూరం చేయడంలో విజయం సాధించారు.



అదుపు తప్పిన బస్సు ఇదే..

ఖాద్రీ ఆలయంలో వరలక్ష్మీవ్రతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కదిరి, ఆగస్టు 30: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతం ఆచరించారు. ఆలయంలోని కల్యాణ వేదికపై అమ్మవారి ఉత్సవవిగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు.. వ్రతం ఆచరించారు. ఆలయ ప్రధానార్చకుడు పార్థసారధిచారులు శాస్త్రోక్తంగా వ్రతం చేయించారు. కార్యక్రమంలో ఈట శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదురై-బెంగళూరు మధ్య మరో వందే భారత్ రైలు

- నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ప్యారీస్, ఆగస్టు 30: చెన్నై-నాగర్‌కోయిల్ మధ్య వందే భారత్ రైలు సేవలను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. అంతేకాకుండా, మదురై-బెంగళూరు మధ్య మరో వందే భారత్ రైలు సేవలను కూడా ఆయన ప్రారంభిస్తారు. చెన్నై-నాగర్‌కోయిల్ వందే భారత్ రైల్లో చైర్‌కార్ క్లాసులో రూ.1,650 నుంచి రూ.1,700 వరకు ఛార్జీ వసూలుచేసే అవకాశముంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు వందే భారత్ రైళ్లు నడుపుతుండగా వీటి ప్రజాదరణ బాగా వస్తోంది. చెన్నై సెంట్రల్ నుంచి మైసూరు, కోయంబత్తూర్, విజయవాడ, ఎగ్మూర్ నుంచి తిరునల్వేలి, కోయంబత్తూర్ నగరాలకు ఈ రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై-నాగర్‌కోయిల్, మదురై-బెంగళూరు మధ్య ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్న కొత్త వందే భారత్ రైళ్ల టైం టేబుల్‌ను దక్షిణ రైల్వే విడుదల చేసింది. 16 బోగీలతో ఉన్న ఈ కొత్త వందే భారత్ రైళ్లలో ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్, మిగిలినవి ఏసీ చైర్ కార్ ఉన్నాయి. చెన్నై ఎగ్మూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 1.50 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నాగర్‌కోయిల్‌లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. బుధవారం మినహా మిగిలిన ఆరు రోజులు ఈ రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే, మదురై నుంచి బెంగళూరు మధ్య నడిచే రైలు మదురైలో ఉదయం 5.15 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు చేరుకుంటుంది. మరుమార్గంలో బెంగళూరు కంటోన్మెంట్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి రాత్రి 9.54 గంటలకు మదురై చేరుకుంటుంది. 8 బోగీలున్న ఈ రైళ్లు మంగళవారం మినహా మిగిలిన ఆరు రోజులు నడపనున్నారు. ఈ రైలు దిండుగల్, తిరుచ్చి, కరూర్, నామక్కల్, సేలం, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే ఐదు వందే భారత్ రైళ్లు అందుబాటులో ఉండగా, భవిష్యత్తులో ఈ రైళ్ల సంఖ్య 10కి పెరిగే అవకాశముందని రైల్వే అధికారులు తెలిపారు.

కాళికాంబ ఆలయంలో విశేష పూజలు



కాళికాంబ అమ్మవారికి అలంకరణ

శిడ్లఘట్ట, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని కాళికాంబ, పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో విశేషపూజలు నిర్వహించారు. వేకువజామున 5 గంటలకు ఆలయ శుద్ధి చేసిన అనంతరం అమ్మవారికి, నవగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. తులసి హారాలు, పూలహారాలతో అలంకరించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి మాట్లాడారు.

గౌరి పండుగకోసం రాజస్థాన్ కళల ప్రదర్శన



స్టాల్స్‌లో దుస్తుల విక్రయాలు

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అత్యంత ఇష్టమైన గౌరిపండుగకోసం ప్రత్యేకంగా చేనేత హస్త కళలు, ఆభరణాలు అందుబాటులోకి తెచ్చేలా రాజస్థాన్ కళల ప్రదర్శన శుక్రవారం ఆరంభించింది. జె.పి.నగర్‌లోని కొత్తనూరు మెయిన్‌రోడ్డులో హ్యాండ్ లూమ్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రదర్శనలు ప్రారంభించారు. కాటన్, సిల్క్, చేనేత, హస్తకళల్లో ఒరిస్సా, టై అండ్ డై, పశ్చిమబెంగాల్, ఒరిస్సా కాటన్ చీరలతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల చేనేత డిజైన్‌లు ప్రదర్శనలో ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఖాదీ కుర్తాలు, ఆభరణాలు ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటలనుంచి రాత్రి దాకా ప్రదర్శనలు ఉంటాయన్నారు. సెప్టెంబరు 8 వరకు ప్రదర్శనలు కొనసాగిస్తామన్నారు.

ప్రమాదభరితంగా కేబుల్ పాట్‌హోల్



గుంతపై అడ్డుగా కొయ్య కుర్చీ

బెంగళూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవన్, మెడికల్ అసోసియేషన్‌తోపాటు పలు ప్రభుత్వశాఖల కార్యాలయాలు నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యన గుంత ఏర్పడింది. కేబుల్ పనులకోసం తవ్వినట్టు తెలుస్తోంది. ప్రమా దాన్ని పాలకులు, బీబీఎంపీ గుర్తించక నిర్లక్ష్యం చేస్తుం డగా స్థానికులు ఓ కుర్చీని అడ్డుగా పెట్టారు. ఎంతటి విపత్కర పరిస్థితి అంటూ సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

జిల్లా ప్రత్యేకాధికారిగా యువరాజ్

పుట్టపర్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించేందుకు జిల్లాకు ప్రత్యేకాధికారిగా యువరాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2005 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఈయన ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, చేపట్టే అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించడంతోపాటు ఆయా విభాగాలను పరిపాలన పరంగా సమన్వయం చేసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకుంటారు.

డ్వాక్రా సొమ్ము దుర్వినియోగంపై ఫిర్యాదు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 30: మండల పరిధిలోని పత్తికుంటపల్లి గ్రామానికి సంబంధించి 'ఆదర్శ గ్రామైక్య సంఘం'గా ఉన్న 24ఎస్‌హెచ్‌జీల నగదును పక్కదారి పట్టించిన యానిమేటర్‌పై ఏపీఎం రామాంజనేయులు, ఏసీ రాంరెడ్డి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ యానిమేటర్ వివిధ సంఘాల నుంచి రూ.8.82లక్షలు వాడేసిందన్నారు. గతంలో దీనిపై ఫిర్యాదు చేయగా కొంతమేర నగదును వెనక్కు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రూ.6.64లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బాధితురాలు నెలరోజుల గడువు అడిగిందని, నెలలోపు చెల్లించకపోతే ఆమెపై చర్యలు తీసుకుంటామన్నారు.